సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

I

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



చలో 'రజతోత్సవం'

ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. సభకోసం సూర్యాపేట జిల్లానుంచి ఎడ్ల బండ్లపై బయలుదేరిన గులాబీ శ్రేణులు శుక్రవారం సాయంత్రానికి వరంగల్ నగర శివారుకు చేరుకున్నాయి. శనివారం ఉదయం ఎల్కతుర్తికి బయలుదేరనున్నాయి.

సభకు ఇలా వెళ్లొద్దాం..
రూట్‌మ్యాప్ వివరాలు

- IIలో▸

న్యూస్‌రీల్

ఎడ్ల బండ్ల ప్రదర్శన



హసన్‌పర్తి: ఈనెల 27వ తేదీన ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతానికి శుక్రవారం దేవన్నపేట, కోమటిపల్లి కార్యకర్తలు శుక్రవారం హసన్‌పర్తిలో ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను మోసం చేశారని ధ్వజమెత్తారు. దేశ వ్యాప్తంగా వృద్ధులకు రూ.200 పెన్షన్ ఇస్తే.. కేసీఆర్ రూ.2వేలిచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్ కాలంలో 24 గంటలపాటు సాగుకు విద్యుత్ అందించారన్నారు. దేవన్నపేటలో ప్రారంభమైన ప్రదర్శన పలు ప్రాంతాల గుండా సాగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ దివ్యారాణి, మాజీ కార్పొరేటర్ రాజునాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ విజేందర్, మాజీ సర్పంచ్ రవి, భూపాల్, వాసుదేవరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సదన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేయిస్తంభాల దేవాలయంలో శనిత్రయోదశి పూజలు

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామివారి వేయిస్తంభాల దేవాలయంలో శనివారం శనిత్రయోదశి, మాసశివరాత్రి పూజలు నిర్వహిస్తున్నట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఈఓ అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనిత్రయోదశి, మాసశివరాత్రి ఒకే రోజు రావడం విశేషమని పేర్కొన్నారు. భక్తులు తమ శని దోష నివారణకుయ తిలదానం, తైలాభిషేకం, మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకం, కల్యాణోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

నేటితో ముగియనున్న బార్ల దరఖాస్తుల గడువు

కాజీపేట అర్బన్ : గ్రేటర్ వరంగల్ పరిధిలో లైసెన్స్ రెన్యువల్ కాని నాలుగు బార్లకు దరఖాస్తు గడువు శనివారం(ఈనెల 26వ తేదీ)తో ముగియనున్నట్లు హనుమకొండ జిల్లా(వరంగల్ అర్బన్) ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో tgbcl. telangana. gov. in వెబ్‌సైట్‌లో లేదా దగ్గరలోని ఎక్సైజ్ స్టేషన్‌లో నేరుగా అందజేయవచ్చునని పేర్కొన్నారు. వివరాలకు 0870-2577502 లేదా 87126 59019, 87120 59022, 87126 59021, 87126 59020 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఐదేళ్ల ఎమ్మెస్సీ ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ మూడో సంవత్సరం విద్యార్థులకు ఈనెల 26నుంచి జరగాల్సిన ఆరో సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్య శుక్రవారం తెలిపారు. జూన్ 6వ తేదీనుంచి ఆయా పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు ఆయా విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు పూర్తిచేయాలని కోరారు.

దరఖాస్తు గడువు పెంపు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొనేందుకు దరఖాస్తు తేదీని ఈ నెల 28 వరకు పొడిగించినట్లు డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 25 క్రీడాంశాల్లో అందించనున్న శిక్షణకు దరఖాస్తుకు 25 చివరి తేదీ కాగా మరో మూడు రోజులు పొడిగించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు 97046 69637 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మలేరియా నివారణపై అవగాహన కల్పించాలి

ఎంజీఎం : మలేరియా నివారణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి వివిధ శాఖల సమన్వయంతో వ్యాధి నిర్మూలనకు పాటుపడాలని హనుమకొండ జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఇన్‌చార్జ్ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మదన్ మోహన్‌రావు ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం వడ్డెపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు.





శుక్రవారం ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్)

ఖిలావరంగల్	42.6
సీరోలు (మానుకోట)	42.4
ములుగు రోడ్డు	42.9
జఫర్‌గఢ్	42.8
కన్నాయిగూడెం	43.2
ములుగు	42.5

ఎండను ఎదుర్కొందాం..

ఉమ్మడి జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- ఇప్పటికే 43 డిగ్రీలు దాటిన వైనం
- వృద్ధులు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు
- పక్షులు, పశువులకు తాగునీరు అందుబాటులో ఉంచుదాం..
- వాహనాల బ్యాటరీపై అధిక లోడ్ ఉండకుండా చూసుకోవాలి..
- ఆయా రంగాల నిపుణుల సలహాలు, సూచనలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్రవారం ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో 42నుంచి 43.8డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోల్‌బెల్ట్ ఏరియా అయిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మే నెలలో 46డిగ్రీలకుపై బడి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఉదయం 10 గంటలు దాటితే అత్యవసరమైతేనే బయటికి వెళ్లాలని చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఆరోగ్యంపట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇదే సమయంలో మూగజీవాలు, పక్షులకు తాగునీటి వసతి కల్పించాలి. ఇప్పుడు ప్రతి నగరం, పట్టణ కేంద్రాల్లో రూఫ్‌గార్డెన్లతో ఇంటికి అవసరమైన కూరగాయలు పండిస్తున్నారు. వారు ఎండ వేడికి మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త పడాలి. దీంతోపాటు ప్రతి ఇంట్లో ద్విచక్రవాహనం ఉంటుంది. మధ్యతరగతి, ఆపై ఉన్నత కుటుంబాల వారు కారు మెయింటెన్ చేస్తుంటారు. మండే ఎండలకు వీటి నిర్వహణ బాగుంటేనే మన ప్రయాణాలు సాఫీగా సాగుతాయి. ఈ నేపథ్యంలో వేసవిని ఎదుర్కొనేందుకు వైద్యులు, వ్యవసాయశాస్త్రవేత్తలు, పశువైద్యాధికారులు చెబుతున్న సూచనలు, సలహాలు మీకోసం..



ఉద్యాన పంటలకు ఎప్పుడూ తేమ ఉండాలి



హన్మకొండ: వేసవిలో ఉద్యాన పంటలను తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కాపాడుకోవచ్చు. కిచెన్, రూఫ్ గార్డెన్ నిర్వహిస్తున్న వారు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. తమ కుటుంబానికి సరిపడా కూరగాయలు పండాలంటే ఎంత స్థలంలో సాగు చేయాలనే విషయాన్ని ముందుగా తెలుసుకోవాలి. సాగుకోసం నర్సరీ నుంచి నాణ్యమైన మొక్కలు తెచ్చి పెంచుకోవాలి. మొక్కలను ఎండ, వాన ఇతర ప్రతికూల పరిస్థితులనుంచి కాపాడుకోవాలి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలతో పూత రాలిపోతుంది. మొక్కలకు ఎప్పుడు తేమ తగిలేలా చూసుకోవాలి. కర్రల సాయంతో గ్రీన్ షేడ్‌నెట్ ఏర్పాటు చేసుకుంటే మంచిది. వేప నూనె, కషాయాలు మొక్కల పాదులో కాకుండా పైనా పిచికారీ చేయాలి. అప్పుడే మొక్క ఆరోగ్యంగా ఉంటుంది. - చేరాల రాకేశ్, వరంగల్ ఉద్యాన అధికారి (టెక్నికల్)

వృద్ధులు, గర్భిణులు జాగ్రత్త..



ఎంజీఎం : వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ ఎం.పవన్‌కుమార్ ప్రజలకు సూచించారు. ఎండాకాలం తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి ఆయన పలు సూచనలు చేశారు.



- అవసరమైతే తప్ప ఉదయం 11 నుంచి 4 గంటల వరకు ఎండలో బయట తిరగకపోవడం మంచిది.
- తేలిగ్గా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. రోజుకి 10 నుంచి 12 గ్లాసుల నీళ్లు తాగాలి
- మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి. నీటిశాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయ, కర్బుజా తినాలి.
- ఆహారంలో మసాలా, ఉప్పు తగ్గించి వాడాలి. రోజుకు రెండు సార్లు స్నానం చేయడం మంచిది.
- వృద్ధులు అత్యవసరమైతే తప్ప ఎండలో తిరగరాదు. బీపీ, షుగర్ రెగ్యులర్‌గా చెక్ చేసుకోవాలి.
- కొన్ని రకాల మాత్రలు (డియురేటిక్స్, ఎస్‌జీఎల్‌టీ 2 ఇన్హిబిటర్స్) వల్ల శరీరంలో నీటి నిల్వలు తగ్గే అవకాశం ఉంది.
- తలనొప్పి, తల తిరగడం, వాంతులు ఉన్నట్లయితే ఎండదెబ్బ తగిలినట్టుగా భావించి డాక్టర్ సలహా తీసుకోవాలి.
- డయాబెటిక్ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, రెగ్యులర్‌గా షుగర్ పరీక్షలు చేయించుకోవాలి.
- డాక్టర్ సలహా లేకుండా మందులు మానేయరాదు.
- గర్భిణులు నీరు, ఆహారం, పండ్లు తగిన మోతాదులో తీసుకోవాలి.

- డాక్టర్ ఎం.పవన్‌కుమార్, ఎండీ, ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్, గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, భూపాలపల్లి

వాహనాలు జరభద్రం..

- ఎండీ జాఫర్, సీనియర్ మెకానిక్



ఖిలా వరంగల్: వేసవిలో ఏ వాహనమైన ఇంధనాన్ని పూర్తిగా నింపొద్దు. ఎండ వేడికి ఇంజన్ ఆయిల్ త్వరగా పలుచబడిపోతుంది. నిర్ణీత సమయానికి ఇంజనాయిల్‌ను మార్చుకోవడం మంచిది. వాహన పెట్రోలు ట్యాంకుపై మందం కవర్ ఉండేలా చూసుకోవాలి. సీట్ల కవర్లు సాధారణమైనవి. అయితే త్వరగా వేడెక్కి మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందుకు ప్రత్యామ్నాయంగా వేడి కాకుండా ఉండేందుకు వెలివేట్ క్లాత్ వంటి సీటు కవరును వాడాలి. ఎండలో ఎక్కువ సమయం పార్కింగ్ చేసి ఉంచితే ద్విచక్రవాహనాలు దెబ్బతింటాయి. ఇంజన్‌లో మంటలు వస్తాయి. టైర్లు పేలుతాయి. ఎప్పటికప్పుడు కూలెంట్ ఆయిల్ చెక్‌చేసుకోవాలి. దూరప్రయాణం చేయాల్సిన వారు మధ్య మధ్యలో వాహనాలను ఆపి 15 నుంచి 20 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల వాహన ఇంజన్ వేడి తగ్గి కూల్ అవుతుంది. వాహనాలను ఎక్కువ సేపు పార్కింగ్ చేయాల్సి వస్తే చెట్టునీడన, షెడ్లలో పార్కింగ్ చేయడం మంచిది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల సమయంలో బైక్ ప్రయాణం చేయకపోవడం చాలా మంచిది. ఎండ వేడికి టైర్లు మెత్తబడి గాలి తగ్గి, బైక్ మధ్యలోనే ఆగిపోతుంది. ఒక్కోసారి బైక్ టైర్లు పేలి అదుపు తప్పి ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. వేసవిలో వాహనాల్లో బ్యాటరీపై ఎక్కువ లోడ్ పడుతుంది. ఇదే సమయంలో అధిక ఉష్ణోగ్రతలు, పరిమితికి మించి వాహనంలో ఎలక్ట్రికల్ ఉపకరణాలను బిగించడం వల్ల షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం ఉంటుంది.



మూగజీవాలకు తాగునీరు అందిద్దాం



- నాగ ప్రసాద్, పశువైద్యాధికారి, బచ్చన్నపేట



జనగామ: వేసవి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల వరకు పెరిగాయి. ఎక్కడా కుళాయిలు అందుబాటులో లేవు. ఇలాంటి పరిస్థితుల్లో పెంపుడు కుక్కలు, వీధి కుక్కలు, పక్షుల దాహార్తి తీర్చేందుకు ప్రతి ఒక్కరూ స్పందించాలి. ప్రభుత్వంతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలి. కుక్కలు, పక్షులు గొంతెండి మృత్యువాత పడకుండా ఇంటి ఆవరణ, భవనాల ముందు, ప్రధాన కూడళ్లలో నీటితొట్లు ఏర్పాటు చేసి ఎప్పుడూ తాగునీరు నిల్వ ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా పక్షులకు ఇంటిదాబా పైన తొట్టిలాంటి మట్టిపాత్రలు ఉంచి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం నీటిని పోస్తూ ఉండాలి. వాటికి దాహం వేసిన సమయంలో అలవాటుగా రోజూ అక్కడికి వచ్చి దాహం తీర్చుకుంటాయి. వరంగల్ మహానగరంలో అయితే బల్దియా ఆధ్వర్యంలో సుమారు 300 చోట్ల నీటితొట్టెలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలాగే అన్ని మున్సిపాలిటీ కేంద్రాల్లో ఏర్పాటుచేస్తే మంచిది. గ్రామాల్లో రోడ్ల వెంట గతంలో నీటితొట్లు ఏర్పాటుచేశారు. వాటిని శుభ్రం చేసి గ్రామ పంచాయతీవారు నీటిని నింపి పెట్టాలి.

చిన్న పిల్లల్లో హీట్ స్ట్రోక్

- డాక్టర్ సుధాకర్, పిడియాట్రిషన్



ఎంజీఎం : హీట్ స్ట్రోక్ (ఎండదెబ్బ) వల్ల ఎండాకాలంలో పిల్లలు బాగా ఇబ్బందులు పడుతుంటారు. ఎక్కువగా ఎండలో తిరిగే వారు, శుభకార్యాలకు వెళ్లేవారు, ఇంటి ఆవరణలో ఎండలో, ఆట స్థలంలో తిరిగే పిల్లలకు ఎక్కువగా హీట్ స్ట్రోక్‌కు గురవుతారు.



హీట్ స్ట్రోక్ లక్షణాలు..

- శరీరం బాగా వేడెక్కడం. వాంతులు, విరోచనాలతో శరీరంలో నీటిశాతం పడిపోతుంది
- పిల్లలకు మూత్రం సరిగ్గా రాకపోవడం, ఎర్రగా రావడం. ఎండలో తిరిగే పిల్లలు తొందరగా అలిసిపోవడం, తలనొప్పి, శరీరంలో నొప్పులు, నరాల బలహీనత , తీవ్ర అస్వస్థతతో కోమాలోకి వెళ్తారు.
- పసిపిల్లలు డల్‌గా ఉంటారు. బరువు తగ్గడం, పాలు సరిగ్గా తాగకపోవడంలాంటి లక్షణాలు ఉంటాయి.
- అందుకే పిల్లలు ఎండలో ఎక్కువగా తిరగకుండా ఉండాలి. ప్రయాణాలు తగ్గించుకోవాలి.
- పిల్లలు ఎక్కువగా నీళ్లు తాగాలి. ఓఆర్‌ఎస్ తాగించాలి.
- వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరింపజేయాలి.





ప్రతీ ఇంట్లో ఎర్త్ వైరింగ్ ఏర్పాటుచేసుకోవాలి

- కూరాకుల పాల్, ఎలక్ట్రీషియన్



నెక్లెస్‌సెంటర్: ఇళ్లలో వినియోగించే ఎలక్ట్రానిక్ వస్తువుల పట్ల జాగ్రత్తలు పాటించాలి. ఇంట్లో వాడుకునే ఫ్రిజ్, టీవీ, ఏసీ, కూలర్, ఫ్యాన్, వంటి వాటిని పిల్లలు ముట్టుకోకుండా చూసుకోవాలి. దీంతో పాటు వేసవిలో విద్యుత్ సరఫరా, అంతరాలు జరిగినప్పుడు, వడ గాలుల వల్ల విద్యుత్ వైర్లు తెగినప్పుడు వాటిని సరి చేసుకునే వరకు ఎలక్ట్రానిక్ వస్తువులను వినియోగించొద్దు. సొంతంగా ఎలక్ట్రీషియన్ పనులు చేయవద్దు. అకాల వర్షాల కారణంగా వర్షాలు, ఉరుములు, మెరుపులు, పిడుగులు పడిన సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఎలక్ట్రానిక్ వస్తువులను కాలిపోయే ప్రమాదం ఉంటుంది. అలాంటి సమయంలో ఎలక్ట్రానిక్ వస్తువులను వినియోగించకూడదు. ఇంట్లో వస్తువులను ఏర్పాటు చేసుకున్నప్పుడు తప్పకుండా ఎర్త్ వైరింగ్ చేయాలి. చార్జింగ్ తీసిన తర్వాత ఫోన్ వినియోగించుకోవాలి. ఇంట్లో ఎలక్ట్రానిక్ వస్తువులు ఎక్కువగా వాడితే మంచి క్వాలిటీ కలిగిన విద్యుత్ వైర్లను వినియోగించాలి. ఇంటి ఆవరణలో ఇనుప తీగలతో దండాలు కట్టుకోవద్దు. దీని వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇంట్లో ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైతే మెకానిక్, ఎలక్ట్రీషియన్‌కు చూపించాలి.



జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

వరంగల్ లీగల్: ఉమ్మడి జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి చండీశ్వరదేవిని యాదాద్రి భువనగిరికి బదిలీ చేయగా.. ఆస్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కుషాయిగూడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.పూజను నియమించారు. ఖాళీగా ఉన్న నర్సంపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ రెండో జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అంకిత్‌ను నియమించారు. హనుమకొండ జిల్లా పరకాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లింగం శాలినిని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టుకు బదిలీ చేయగా.. ఆస్థానంలో ఎల్‌బీనగర్ రెండో జూనియర్ సివిల్ జడ్జి జి.సాయిశరత్‌ను నియమించారు. మహబూబాబాద్ జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా హైదరాబాద్‌కు చెందిన జూనియర్ సివిల్ జడ్జి ఎం.స్వాతిని నియమించారు. మహబూబాబాద్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతిని రెండో జూనియర్ సివిల్ జడ్జిగా మల్కాజ్‌గిరికి, ఆయన స్థానంలో హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్వపల్లి కృష్ణతేజ్‌ను నియమించారు. తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్టా సరితను పెద్దపల్లి జిల్లా నందిమేడారం కోర్టుకు, ఆస్థానంలో షాద్‌నగర్ కోర్టుకు చెందిన జడ్జి ధీరజ్‌కుమార్‌ను నియమించారు. భూపాలపల్లి జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.రాంచందర్‌రావును సిటీ సివిల్ కోర్టు హైదరాబాద్‌కు, ఆయన స్థానంలో మేడ్చల్ కోర్టుకు చెందిన జూనియర్ సివిల్ జడ్జి దిలీప్‌కుమార్‌నాయక్‌ను బదిలీ చేశారు. ములుగు జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ జూనియర్ సివిల్ జడ్జి గుంటి జ్యోత్స్నను నియమించగా.. ములుగు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌఖ్యను హైదరాబాద్‌కు బదిలీ చేశారు.

వాహనదారుల సౌలభ్యం కోసం నీడతెరలు

మేయర్ గుండు సుధారాణి

వరంగల్: నగరంలోని వాహనదారుల సౌలభ్యం కోసం నీడతెరలను ఏర్పాటు చేస్తున్నట్లు మేయర్ గుండు సుధారాణి తెలిపారు. హనుమకొండ పరిధి అదాలత్ సిగ్నల్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నీడ తెరలను శుక్రవారం మేయర్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ప్రతిరోజూ ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయికి చేరుతున్నాయన్నారు. ఈ క్రమంలో హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్లలో సిగ్నల్ పాయింట్స్ వద్ద రెడ్ సిగ్నల్ పడినప్పుడు నిరీక్షించాల్సిన అవసరం ఉంటుందని, వాహనదారులకు ఎండనుంచి ఉపశమనం కోసం నీడ తెరలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. హనుమకొండ ప్రాంతంలోని ప్రధాన కూడళ్లు అదాలత్ జంక్షన్, పోలీస్ హెడ్ క్వార్టర్, అశోక, ములుగు రోడ్డు, కాకతీయ యూనివర్సిటీ జంక్షన్లు, వరంగల్ ప్రాంతంలో పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, పోస్టాఫీస్ జంక్షన్‌తోపాటు అవసరం మేరకు ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈఈ రవికుమార్, డీఈలు రాజ్‌కుమార్, కార్తీక్‌రెడ్డి, ఏఈ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అదాలత్ జంక్షన్‌లో నీడ తెరను పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేయాలి

ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న కాత్యాయనీ విద్మహే

నయీంనగర్: ఇటీవల ఛత్తీస్‌గఢ్ తెలంగాణ సరిహద్దులోని ఊసూరు కర్రిగుట్టలోకి ఆపరేషన్ కగార్ పేరుతో వేలాదిగా పోలీస్ బలగాలు జరుపుతున్న కాల్పులను వెంటనే ఆపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కోరింది. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వేదిక సభ్యులు ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, పౌరహక్కుల సంఘం నుంచి పి.రమేష్, మానవ హక్కుల సంఘం బాదావత్ రాజు, టీపీఎఫ్ జె.కుమారస్వామి, సీఎంఎస్ కళావతి, శాంతక్క మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, మధ్యభారతంలో ఆదివాసీల హననాన్ని ఆపివేయాలని కోరారు. మధ్యభారతంలో అపార విలువైన ఖనిజ వనరులను దేశ, విదేశీ వాణిజ్య సామ్రాజ్యవాదులు, కార్పొరేట్‌లతో ఒప్పందాలు చేసుకొని అందులో భాగంగా ఆదివాసీలు, వారికి అండగా ఉన్న మావోయిస్టులను అంతం చేసే కుట్ర జరుగుతోందన్నారు. ఇరువర్గాలు కాల్పులు విరమించి శాంతిచర్చల వైపు ప్రయత్నాలు చేయాలని సూచించారు. సమావేశంలో కోడం కుమార్, రాచర్ల బాలరాజు, క్రాంతి, శివ, ప్రవీణ్ కుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పదేళ్ల విధ్వంసాన్ని ప్రజలు మరిచిపోరు

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి. చిత్రంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ సుధారాణి తదితరులు

హన్మకొండ చౌరస్తా: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలుగా చేసి సృష్టించిన విధ్వంసాన్ని ప్రజలు అంత సులువుగా మరిచిపోరని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి చేసిందేమిటో చెప్పకుండా పింక్ బుక్, రెడ్ బుక్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడడం సరికాదన్నారు. పదేళ్లలో చేయలేని అభివృద్ధిని సీఎం రేవంత్‌రెడ్డి 16 నెలల హయాంలో చేశారని అన్నారు. వారు చేయలేనివి, మేము చేసినవి ఆధారాలతో సహా చర్చకు సిద్ధమని అనేక సార్లు చెప్పామని అన్నారు. చందాలు వసూలు చేసిన వందల కోట్లతో పెట్టే సభను ప్రజలు బహిష్కరించాలని కోరారు. హనుమకొండ జిల్లాలో సభ పెట్టి, చలో వరంగల్ అనడం హాస్యాస్పదం అన్నారు. బీఆర్‌ఎస్ ఉనికి చాటుకోవడానికే సభ, కబ్జాలు చేయడం , కాళ్లు మొక్కడం ఆ పార్టీ నాయకుల పని అంటు ఎద్దేవా చేశారు. నాడు కొండా మురళి గోడ కుర్చీ వేయించిన విషయాన్ని కొందరు నాయకులు మరిచిపోయి నేడు నీతులు మాట్లాడుతున్నారని అన్నారు. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ మళ్లీ అధికారంలోకి వస్తామని బీఆర్‌ఎస్ కలలు కంటుందని, అవీ దింపుడు కల్లం ఆశలేనని అన్నారు. సమావేశంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, కార్పొరేటర్ విజయశ్రీరజాలీ, నాయకులు మండల సమ్మయ్య, కొటిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై కాంగ్రెస్ మొసలి కన్నీరు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కొమురయ్య

ఖిలా వరంగల్: అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానించి, ఆయన ఆశయాలను తుంగలో తొక్కిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని టీచర్స్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య ఆరోపించారు. అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ చింతల్ రోడ్డులోని సుష్మిత గార్డెన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్‌పై కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తోందని ఆరోపించారు. ఆయన ఆశయాలను నెరవేర్చే దిశగా ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. సమావేశంలో మాజీ మంత్రి గుండె విజయ రామారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు పోలేపాక మార్టిన్ లూథర్, నాయకులు రామిండ్ల బాబురావు, గడ్డం మహేందర్, జన్ను ఆరోగ్యం, రాజు, అనిత, రత్నం సతీశ్‌షా, డాక్టర్ వన్నాల వెంకటరమణ, బాకం హరిశంకర్, రాణా ప్రతాప్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


రజతోత్సవ సభకు
ఇలా వెళ్లొద్దాం..

బీఆర్ఎస్ పాతికేళ్ల వేడుకల సభకు ఏర్పాట్లు పూర్తి

159 ఎకరాల్లో వేదిక, సభాస్థలం.. ● జనం కోసం సకల వసతులు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాతికేళ్ల వేడుకలకు వేళయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు రూట్లలో వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేడుకలకు ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. వేదిక ముందు లక్ష కుర్చీలు, మిగతా జనం కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.

\- సాక్షిప్రతినిధి, వరంగల్





హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సిద్ధమైన సభా వేదిక

జోన్-1 వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు
రూట్: మల్లంపల్లి-గుడెప్పాడ్ -వంగపహాడ్- యూ టర్న్ ఎన్‌హెచ్ 163-హసన్‌పర్తి -ఎల్కతుర్తి

జోన్-2 ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర
రూట్: ఖమ్మంనుంచి వచ్చే వారు మామునూరు-నాయుడు పెట్రోల్ పంప్-టయోటా షోరూం-కడిపికొండ బ్రిడ్జి-మడికొండ-ఎన్‌హెచ్ 163 బైపాస్ రోడ్డు -టోల్‌గేట్-దేవన్నపేట-మడిపల్లి-అనంతసాగర్, కరుణాపురం -ఎన్‌హెచ్ 163 బైపాస్ టోల్‌గేట్-దేవన్నపేట -మడిపల్లి-అనంతసాగర్-పార్కింగ్

జోన్-3 జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్
రూట్: ధర్మసాగర్-దేవునూరు -దామెర-చింతలపల్లి-పార్కింగ్

జోన్-4 ఉమ్మడి కరీంనగర్ నియోజకవర్గాలు, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంతభాగం)
రూట్: కరీంనగర్, హుజూరాబాద్-కోతులనడుమ-గ్రానైట్ రోడ్డు పార్కింగ్

జోన్-5 ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు, నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్
రూట్: సిద్దిపేట-ముల్కనూరు-ఇందిరా నగర్ పార్కింగ్

పార్కింగ్ జోన్లు 5
కేటాయించిన భూమి 1,179

సభ వివరాలు



మొత్తం సేకరించిన భూమి : 1,356 ఎకరాలు
సభావేదిక : 159 ఎకరాలు

- సభకు హాజరయ్యే వారి కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు సేవలందిస్తాయి.
- నిరంతర కరెంటుకు 200 జనరేటర్ల ఏర్పాటు.

సభ వేళ ట్రాఫిక్ మళ్లింపు

- వాహనదారులు సహకరించాలి
- ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

వరంగల్ క్రైం: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వరంగల్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా దారి మళ్లిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఈ ఆంక్షలు ఉంటాయని.. వాహనదారులు, ప్రయాణికులు సహకరించాలని కోరారు.

వాహనాల మళ్లింపు ఇలా..

- కరీంనగర్ నుంచి హనుమకొండ, వరంగల్ వచ్చే వాహనాలు
వయా: పరకాల క్రాస్ (హుజూరాబాద్), ఉప్పల్, కమలాపూర్, అంబాల, ముచ్చర్ల క్రాస్ రోడ్ నూతనంగా వేసిన రోడ్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా రావాలి.
- వరంగల్, హనుమకొండ నుంచి కరీంనగర్ వెళ్లే వాహనాలు
వయా: హనుమకొండ, ముచ్చర్ల క్రాస్ రోడ్ నూతనంగా వేసిన రోడ్డు నుంచి ఓఆర్ఆర్, అంబాల, కమలాపూర్, ఉప్పల్, పరకాల క్రాస్ రోడ్ (హుజూరాబాద్), కరీంనగర్‌కు వెళ్లాలి.
- సిద్దిపేట నుంచి హనుమకొండ
వయా: సిద్దిపేట, జనగామ, హనుమకొండ
- హనుమకొండ నుంచి సిద్దిపేట
వయా: హనుమకొండ, జనగామ, సిద్దిపేట
- హుస్నాబాద్ నుంచి హనుమకొండ
వయా: హుస్నాబాద్, తరిగొప్పుల, హనుమకొండ
- హనుమకొండ నుంచి హుస్నాబాద్
వయా: హనుమకొండ, జనగామ, సిద్దిపేట
- హుస్నాబాద్ నుంచి హనుమకొండ
వయా: ముల్కనూరు, కొత్తకొండ, వేలేరు, మల్లికుదుర్ల, క్యాతంపల్లి, పెద్దపెండ్యాల, హనుమకొండ
- హనుమకొండ నుంచి హుస్నాబాద్
వయా: హనుమకొండ, పెద్దపెండ్యాల, క్యాతంపల్లి, మల్లికుదుర్ల, కొత్తకొండ, ముల్కనూరు మీదుగా వాహనాలను మళ్లించనున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ వెల్లడించారు.

దేశం.. ఎల్కతుర్తి వైపు చూస్తోంది

- మాజీ మంత్రి గంగుల కమలాకర్
- సభాస్థలి పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న గంగుల కమలాకర్

ఎల్కతుర్తి: దేశం.. ఎల్కతుర్తి వైపు చూస్తోందని, ఈనెల 27న పార్టీ రజతోత్సవ భారీ బహిరంగ సభ రాజకీయ పార్టీ సమావేశం కాదని, రాష్ట్ర ప్రజలందరి పండుగ అని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు చింతలపల్లి సమీపంలో రజతోత్సవ సభ ఏర్పాట్లను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి సభ ఏర్పాట్లు పరిశీలించారు. హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి 50 వేల మంది తరలివస్తారని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వెల్లడించారు. పరిశీలించిన వారిలో పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు పేర్యాల రవీందర్‌రావు ఉన్నారు.

నేతల తాకిడి..

బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లను రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నేతలు పరిశీలించారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, రాజ్యాసభ సభ్యులు మద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, ఉమ్మడి ఖమ్మం నుంచి రేగా కాంతారావు, హరిప్రియ, కామారెడ్డి నుంచి జాజుల సురేందర్ తదితర నేతలు సభాస్థలికి రాగా వారికి ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితెల సతీశ్‌కుమార్, నాగుర్ల వెంకన్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి తదితరులు సభా ప్రాంగణంలో ఏర్పాట్ల గురించి తెలిపారు. వారికి కేటాయించిన పార్కింగ్ స్థలాలను చూపించారు.

దండులా కదిలిరావాలి..

రజతోత్సవ సభకు ప్రజలు దండులా కదిలి రావాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాలమూరు జిల్లాకు కేటాయించిన పార్కింగ్ స్థలాన్ని ఆయన పరిశీలించారు.

కుల దూషణ కేసులో ఒకరికి జైలు

వరంగల్ లీగల్: వరంగల్ మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతిని బెదిరించి కులం పేరుతో దూషించిన నేరంలో నర్సంపేట మండలం ముత్తోజిపేట గ్రామానికి చెందిన నేరస్తుడు యం.మోహన్‌రెడ్డి, ఆరు నెలల జైలు శిక్ష మూడు వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి మనీష శ్రావణ్ ఉన్నమ్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2010 మార్చి 29న అప్పటి జెడ్పీ చైర్‌పర్సన్ అయిన లకావత్ ధన్వంతి తన అధికార బాధ్యతల నిర్వహణలో భాగంగా కార్యాలయంలో ఉన్న సమయంలో నర్సంపేట మండలం ముత్తోజిపేట గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ధన్వంతి వద్దకు వచ్చి తనను తాను కాంగ్రెస్ పార్టీ నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థిగా పరిచయం చేసుకున్నాడు. అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరుతూ దరఖాస్తు ఇచ్చాడు. పరిశీలించిన చైర్‌పర్సన్ ప్రస్తుతం నిధులు లేవు మరోసారి చేస్తానని చెప్పగా.. గట్టిగా అరుస్తూ 'నువ్వెంత? నువ్వు గెలిచావు.. నేను ఓడిపోయాను.. ఇద్దరం సమానమే నాకు నిధులు ఇవ్వాల్సిందే' అని గట్టిగా అరుస్తూ టేబుల్‌పై కొట్టగా అది విన్న పోలీసులు, గన్‌మెన్, సిబ్బంది చైర్‌పర్సన్ గదిలోకి వచ్చారు. అందరి ఎదుటనే రిజర్వేషన్ వల్ల లంబాడీ కులం నుంచి వచ్చి రాజకీయాలను భ్రష్టు పట్టించారని బెదిరించాడు. కులం హోదాను అవమానిస్తూ దూషించాడు. దీనిపై చైర్‌పర్సన్ ధన్వంతి ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు బెదిరింపులు, ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నేరస్తుడు యం.మోహన్‌రెడ్డి, ఆర్నెళ్ల జైలు శిక్ష.. రూ.3 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. కేసును పీపీ సంతోశ్ వాదించగా సాక్ష్యులను కానిస్టేబుల్ చందర్ కోర్టులో ప్రవేశపెట్టారు.

రాజలింగమూర్తి హత్య కేసులో నిందితులకు బెయిల్

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిన నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసులో పలువురు నిందితులకు భూపాలపల్లి జిల్లా ప్రధాన కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఫిబ్రవరి 19న జరిగిన హత్య కేసులో పోలీసులు 12 మంది నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపగా.. ఇద్దరు వ్యక్తులకు గత నెలలో బెయిల్ వచ్చింది. కొత్త హరిబాబు, రేణుకుంట్ల కొమురయ్యకు మినహా మిగితా 8 మందికి షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. హరిబాబు, కొమురయ్య హైకోర్టులో బెయిల్ పిటిషన్ వేయగా.. హైకోర్టు నుంచి బెయిల్ రావాల్సి ఉంది.

దంపతుల అదృశ్యం.. కేసు నమోదు



అదృశ్యమైన దంపతులు

కాజీపేట: దాదాపు 5 రోజులుగా భార్యాభర్తలు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హనుమకొండ జవహర్ నగర్ కాలనీకి చెందిన అయిత సందీప్, మానస ఈనెల 21న ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధుమిత్రుల ఇళ్లలో ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. గురువారం రాత్రి వడ్డేపల్లి చెరువు ప్రాంతంలో బైక్ లభించడంతో సందీప్ తండ్రి సంపత్‌కుమార్ కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో విచారణ చేపట్టినట్లు వివరించారు.



మిర్చి రైతులకు మెరుగైన ధర ఇవ్వాలి

- జేడీఎం ఉప్పుల శ్రీనివాస్



చాంబర్ ప్రతినిధులు, మిర్చి వ్యాపారులతో మాట్లాడుతున్న జేడీఎం శ్రీనివాస్

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రైతులకు నాణ్యత ప్రకారం మెరుగైన ధరల్ని ఇచ్చేందుకు వ్యాపారులు కృషి చేయాలని వరంగల్ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మార్కెట్ ప్రధాన కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, మిర్చి వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఇందులో మిర్చి ధరలపై సుదీర్ఘంగా చర్చించారు. తేజ రకం మిర్చిని జిల్లాలోని రైతులు ఖమ్మం మార్కెట్‌కు తరలించడంపై అధికారులు స్పందించి సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. కొద్దిరోజులుగా తేజ రకం మిర్చి ధరలు వరంగల్, ఖమ్మం మార్కెట్‌లో వ్యత్యాసం ఎక్కువగా ఉందని, రైతుల నుంచి వచ్చిన ఆరోపణలను వ్యాపారుల దృష్టికి తీసుకెళ్లారు. అక్కడికి నంబర్-1 క్వాలిటీ వెళ్తుందని, ఇక్కడికి 2, 3 రకం వస్తున్నందున ఈపరిస్థితులున్నట్లు వ్యాపారులు చెప్పారు. ఖమ్మం మార్కెట్ నుంచి తెచ్చిన శాంపిళ్లను వారి ముందు పెట్టి వరంగల్‌కు వచ్చిన మిర్చి ఒకేలా ఉన్నా ఎందుకు ధరల్లో వత్యాసం ఉందని ప్రశ్నించినట్లు తెలిసింది. దీనికి వ్యాపారులు ఘాటు తక్కువ ఉందని, కలర్ తక్కువ ఉందని వివిధ కారణాలు చెప్పినా.. అధికారులు సంతృప్తి చెందలేదని తెలిసింది. వరంగల్ మార్కెట్‌కు వచ్చే మిర్చికి నాణ్యతా ప్రమాణాల ప్రకారం.. మెరుగైన ధరలు చెల్లించేలా చాంబర్ ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని జేడీఎం సూచించారు. సోమవారం నుంచి ఈసమస్యను పరిష్కరించేందుకు సహకారం అందిస్తామని వ్యాపారులు హామీ ఇచ్చినట్లు సమాచారం. సమావేశంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డి, చాంబర్ ప్రతినిధులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్, రాజు కరాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీథమ్-25 వేడుకలు షురూ



ఎడ్ల బండిపై వస్తున్న విద్యార్థులు



సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు

హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 'శ్రీథమ్-25' వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడారు. దేశ సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షించాలన్నారు. క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని.. విద్యార్థినుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. తొలుత జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శ్రీవాణి, ఏఓ వేణుగోపాల్‌తో పాటు విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు రైలుకింద పడి ఒకరి మృతి

జనగామ రూరల్: జనగామ రైల్వే స్టేషన్ సమీపంలో కాజీపేట వైపు వెళ్లే గుర్తు తెలియని ట్రెన్ నుంచి ప్రమాదవశాత్తు జారి పడి శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి మృతి చెందాడు. మహారాష్ట్రకు చెందిన సోలంకి గోవింద మహదేవ్ హైదరాబాద్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. హైదరాబాద్ నుంచి కాజీపేట వస్తున్న గుర్తు తెలియని ట్రెన్ కింద ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు జీఆర్పీ పీసీ నరేశ్ తెలిపారు.

మానుకోటలో ఏసీబీ అధికారుల సోదాలు

- సస్పెండ్ అయిన డీటీఓ గౌస్ పాషాపై కేసు



మానుకోటలో మాజీ డీటీఓ గౌస్ పాషాను విచారిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమేశ్, తదితరులు

మహబూబాబాద్ రూరల్: సస్పెన్షన్కు గురైన జిల్లా రవాణా శాఖ అధికారి గౌస్ పాషాపై ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడని పలు సెక్షన్లపై కేసు నమోదు చేసినట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న గౌస్ పాషా ఇంటికి ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేశ్ తన బృందంతో చేరుకుని విస్తృత సోదాలు నిర్వహించారు. ఇదే సమయంలో.. రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల్లో ఉంటున్న గౌస్ పాషా బంధువుల ఇళ్లలో ఏకకాలంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు బృందాలుగా విడిపోయి విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో రూ.3.51 కోట్ల రూపాయల విలువైన వాహనాలు, వ్యవసాయ భూములు, నివాస స్థలాలు, భవనాలకు సంబంధించిన పలు పత్రాలను స్వాధీనం చేసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ఈ ఆస్తుల విలువ ఇంకా అధికంగా ఉంటుందని తెలిపారు. ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడనే ఆరోపణలతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆయన అద్దెకు ఉంటున్న ఇంట్లో, హైదరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో ఉంటున్న బంధువు ఇళ్లలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. గతంలో మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఏసీబీ అధికారుల సోదాల్లో గౌస్ పాషా డ్రైవర్ సుబ్బారావు, పలువురు ఏజెంట్లు, జూనియర్ అసిస్టెంట్ రవీందర్ వద్ద అదనంగా ఉన్న రూ.895, కిటికీలో పడేసిన రూ.300, మొత్తంగా రూ.62,795 నగదు, నూతన లైసెన్సులు, రెన్యువల్స్, ఫిట్ నెస్ కు సంబంధించిన కాగితాలు, పలు వాహనాల తాళం చేతులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో 2024 మే 28న జిల్లా రవాణా శాఖ అధికారి గౌస్ పాషా సస్పెన్షన్ కు గురయ్యారు. ఇప్పుడు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడనే పలు ఆరోపణలు రావడంతో మాజీ జిల్లా రవాణా శాఖ అధికారి ఇంట్లో, ఆయన బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహిస్తూ పలు కీలకమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

సంక్షోభంలోకి యూనివర్సిటీలు

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ పాపిరెడ్డి



మాట్లాడుతున్న పాపిరెడ్డి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరిలూదిన యూనివర్సిటీలు రోజురోజుకూ సంక్షోభంలోకి నెట్టివేయబడుతున్నాయని రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అన్నారు. రెగ్యులరైజేషన్ చేయాలని కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలనా భవనం ఎదుట కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న సమ్మె శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఏళ్లుగా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఆందోళనలు చేసినప్పటికీ గత ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ బాధ్యులు కరుణాకర్‌రావు, సంకినేని వెంకట్, రవీందర్, సాదురాజేశ్, శ్రీధర్‌కుమార్ లోథ్, జూల సత్య, ఆరూరి సూర్యం, సూర్యనారాయణ, చంద్రశేఖర్, నాగయ్య, శ్రీదేవి, శ్రీలత, కవిత, సరిత, సుజాత తదితరులు పాల్గొన్నారు. కాగా.. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులదాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు.

టీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య



ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో నిర్వహించిన డీటీఎఫ్ సమావేశంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) హనుమకొండ జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.ఉప్పలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా బి.అంజనీదేవి, ఎ.మల్లయ్య, కార్యదర్శులుగా డాక్టర్ ఎం.సారంగపాణి, ఎస్.సుమ, బాపూరావు, సాయిపేట, ఎ.కిషన్, రాష్ట్ర కౌన్సిలర్లుగా డాక్టర్ ఎం.గంగాధర్, ఎన్.సుభాషిణి, టి.లింగారెడ్డి, ఫ్రాన్సిస్, జేవియర్, ఎ.సంజీవరెడ్డి, ఎ.శ్రీనివాస్, డి.రమేశ్ ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.సమ్మిరెడ్డి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాపబాబు వ్యవహరించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.

నర్సంపేట రూరల్: నర్సంపేటలోని మల్లంపలి రోడ్డులో శుక్రవారం ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన హర్షియాబేగం (28) భర్త అబ్దుల్ గణితో కలిసి నర్సంపేటలోని మల్లంపల్లి రోడ్డులో జీవనం సాగిస్తోంది. వీరి ఒక పాప. ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైంది. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని హర్షియా బేగంను పోస్టుమార్టానికి తరలించారు. మృతురాలి మామ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి ఒకరు..

ఖిలా వరంగల్/కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం కోమటిపల్లి తండాకు చెందిన బానోతు రమేశ్ (36) కుటుంబకలహాలతో గురువారం రాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తాళ్ల పూసలపల్లి కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య బడి తండా సమీపాన ఈ ఘటన జరిగింది. రమేశ్ దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. జీవితంపై విరక్తి చెందిన గురువారం రాత్రి కేసముద్రం తాళ్లపూసలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య బడి తండా సమీపాన అప్‌లైన్‌పై వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కిందపడి బానోతు రమేశ్ ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బానోతు బీమా ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ తెలిపారు.



బానోతు రమేశ్

వృద్ధురాలు..

గుర్తు తెలియని వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. రైల్వే జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 65 నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తు తెలియని వృద్ధురాలు వరంగల్ రైల్వేస్టేషన్ యార్డులో 377/41 మైలు రాయి వద్ద గుర్తు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటనలో ఆమె తలకు శరీర భాగాలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందింది. వృద్ధురాలు ఆకుపచ్చ రంగు, డిజైన్ గల చీర, పసుపు రంగు జాకెట్ ధరించి ఉందని, ఆమె 5.2 ఎత్తు ఉందని, గుండ్రని ముఖం ఉన్నట్లు తెలపిరాఉ. కాగా మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. వరంగల్ రైల్వే అధికారుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్ తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు వరంగల్ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీస్ స్టేషన్, లేదా 97017 47014 ,87126 58585 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BEAUTY PARLOUR
■ సమ్మర్ స్పెషల్ ఆఫర్ శ్రీశైలిబ్యూటీ పార్లర్ ఓన్లీ అడ్మిషన్ ఫీ 2000 & సర్టిఫికేట్ ఫ్రీ బ్యూటిషియన్ మగ్గం వర్క్ కోర్స్ నేర్పించబడును. ✆ 9989060668. [SCA25002956]

BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48గంటల్లో హోంలోన్ పొందడం కష్టం కాదు- Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి: 7406393937 [HA-453]

WANTED
■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA25002882]
■ In a Famous University Wanted Tele callers. Qualification any Graduation Part Time / Full Time Available. First Preference for Experienced Candidates. Contact ✆ 79958 64165. [B-29]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/-
అదనపు లైను రూ॥ 60/- మాత్రమే
5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కంటికి ఆహారం... వ్యాయామం

మన శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో కంటికి కూడా అంతే అవసరం. రోజూ కొద్ది సేపు ఈ కంటి వ్యాయామాలు చెయ్యడం వలన కంటి చూపు వృద్ధి చెందుతుంది. దీనికి ప్రత్యేకంగా సమయం కేటాయించవలసిన అవసరం లేదు. ఎప్పుడు.. ఎక్కడ... ఎలా వీలయితే అలా సులువుగా చేసుకోవచ్చు. ఏం లేదు... పైకి, కిందికీ, పక్కలకూ కళ్ళను కదుపుతూ కొంతసేపు కంటి వ్యాయామాలు చేస్తే సరిపోతుంది.

అలాగే కంటికి మంచి చేసే ఆహారం కూడా ఉంది. ఆకుకూరల్లో కరివేపాకు, పొన్నగంటి, మెంతికూర, తోటకూర కంటిచూపును కాపాడుకోవడానికి దోహదం చేస్తాయి. పండ్లలో



బొప్పాయి, మామిడి, ఉసిరి మంచిది. అలాగే క్యారట్, కోడిగుడ్డు, పాలు కంటికి మేలు చేస్తాయి.

20-20-20

ఎక్కువగా కంప్యూటర్ ముందు పని చేసేవారికి కళ్లు బాగా అలసటకు గురవుతాయి. అలాంటివారు ఈ 20-20-20 రూల్ ని పాటించాలి. అది వెరీ సింపుల్. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి బ్రేక్ తీసుకుని కంప్యూటర్‌ని కాకుండా 20 మీటర్ల దూరంలో ఉన్న ఏదైనా వస్తువుని 20 సెకన్ల పాటు చూడండి. ఇదే 20-20-20 రూల్. అలాగే కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల కళ్ళు దెబ్బతినకుండా ఉండడం కోసం యాంటీ గ్లేర్ గ్లాసెస్‌ను ఉపయోగించండి.

ఇంతవరకూ ఏ సమస్యలూ లేకపోతే ఏడాదికి కనీసం ఒక్కసారైనా కంటిపరీక్షలు చేయించుకోవాలి. ఇప్పటికే కళ్లజోడు వాడుతున్నవారయితే ఏడాదికి రెండు సార్లు విధిగా కంటిపరీక్షలు చేయించుకోవడం మంచిది.

పైన చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ, మంచి ఆహారం తీసుకోవడం వల్ల కంటి వ్యాధులు ఉన్నవారికి కొంతవరకు ఉపశమనం లభిస్తుంది. ఏ వ్యాధీ లేనివారు భవిష్యత్తులో కంటి జబ్బులు రాకుండా కాపాడుకోవచ్చు.

పారేయకండి.. పదును పెట్టండి





వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, న్యూస్ పేపర్లు, పనికిరాని ఇతర గృహోపకరణాలను బుర్రకు కాస్త పదును పెడితే చాలు... కళాఖండాలుగా తయారు చేయచ్చు. ఈ వేసవి సెలవల్లో పిల్లలకు దీనిపై కాస్తంత ఐడియా ఇస్తే చాలు... ఆనక వాళ్లే అల్లుకు పోతారు. వీటితో సృజనాత్మకత పెరగడమే కాదు.. కుదురు వస్తుంది. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతెలుస్తుంది. వనరుల పరిరక్షణ, రీసైక్లింగ్ ప్రాముఖ్యత తెలిసొస్తాయి. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ఒక సారి వాడి పడేసే కార్టన్‌లను ఆహ్లాదకరమైన జంతువుల ఆకారాలుగా మార్చవచ్చు. ఇది పిల్లల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంచడానికి దోహదపడుతుంది. ఇందుకోసం పిల్లలను వారికి ఇష్టమైన జంతువు లేదా పక్షుల గురించి అడిగి, వాటి ఆకారాలను కాగితంపై ఔట్‌లైన్ గీయడం ద్వారా ప్రారంభించవచ్చు.

కావలసినవి: **ఖాళీ కార్టన్లు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, గమ్, గూగ్లీ కళ్ళు, పైప్ క్లీనర్లు.**

ఆలోచనకు తగ్గట్టు కార్టన్‌ను వివిధ ఆకారాలుగా కత్తిరించుకుని వారికి ఇష్టమైన రంగులలో పెయింట్ చేయనివ్వండి. రంగులు కలిపి నమూనాలను రూపొందించడానికి వారికే అవకాశం ఇవ్వడం మంచిది.

అలంకరణ: రంగు ఆరిన తర్వాత, గూగ్లీ కళ్ళపై జిగురు వేయండి. మార్కర్ల సాయంతో ముఖంలో ఇతర భాగాలను లేదా నమూనాలను గీయండి. పైప్ క్లీనర్‌లతో కాళ్ళు, యాంటెన్నా లేదా తోకలుగా చేసి చిన్న రంధ్రాలు చేసి దారంతో అటాచ్ చేయండి.



టాయిలెట్ పేపర్ రోల్ బైనాక్యులర్లు..

ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్‌ను బైనాక్యులర్‌లుగా మార్చుకోండి,

కావలసినవి: **రెండు ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్, నూలు లేదా రిబ్బన్, యాక్రిలిక్ పెయింట్ బ్రష్‌లు, గమ్, స్టిక్కర్లు, డెకరేషన్లు.**

పెయింటింగ్: పిల్లలను టాయిలెట్ పేపర్ రోల్స్‌కు పెయింట్ వేయమని చెప్పి, వాటిని పూర్తిగా ఆరిన తర్వాత పక్కపక్కనే అతికించండి. గ్లూ గట్టి పడగానే మెడ పట్టీకోసం రెండువైపులా నూలు లేదా రిబ్బన్‌ముక్కను అటాచ్ చేయండి. వీటికి స్టిక్కర్లు, మార్కర్లు, ఇతర అలంకరణలతో డెకరేట్ చేయండి. అలా తయారైన బైనాక్యులర్లతో సరదాగా బయటి ప్రదేశాలను చూడమని చెప్పండి.



బాటిల్ క్యాప్ అయస్కాంతాలు...

పాత బాటిల్ మూతలను అయస్కాంతాలుగా మార్చండి. వీటితో మీ రెఫ్రిజిరేటర్‌ను అందంగా అలంకరించండి.

కావలసినవి: **మెటల్ బాటిల్ మూతలు, చిన్న గుండ్రని అయస్కాంతాలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, పూసలు, బటన్లు, సీక్విన్, గ్లూ**

తయారీ: బాటిల్ మూత లోపల, వెలుపల బ్రైట్ కలర్స్ తో పెయింట్ చేయండి.ఆరిన తర్వాత క్యాప్‌ల లోపల చిన్న పూసలు, బటన్లు లేదా గవ్వలను అతికించండి. గ్లూ లేదా మంచి గమ్‌తో ప్రతి బాటిల్ మూత వెనుక భాగంలో ఒక చిన్న గుండ్రని అయస్కాంతాన్ని అటాచ్ చేయండి. ఇలా తయారైన వాటితో రిఫ్రిజిరేటర్‌పై కళాకృతులు, నోటీసులు లేదా ఫోటోలను ప్రదర్శించండి.



ప్లాస్టిక్ బాటిల్ ప్లాంటర్లు...

ప్లాస్టిక్ బాటిళ్లను అందమైన ప్లాంటర్‌లుగా తిరిగి ఉపయోగించవచ్చు, పిల్లలకు రీసైక్లింగ్, తోటపని నేర్పచ్చు.

కావలసినవి: **ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, కత్తెర, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, మట్టి, చిన్న మొక్కలు లేదా విత్తనాలు.**

తయారీ: ప్లాస్టిక్ బాటిళ్లను సగానికి కట్ చేసి, పైభాగాన్ని పారవేయండి. సీసాల దిగువ భాగాలను రంగులతో అలంకరించండి. ఇలా అలంకరించిన సీసాలను మట్టితో నింపి వాటిలో విత్తనాలు లేదా చిన్న మొక్కలను నాటండి. వీటిని ఎండ పడే ప్రదేశంలో ఉంచి, రోజూ నీరు పెట్టండి.

వార్తాపత్రిక కోల్లేజ్ కళ...

పాత వార్తాపత్రికలను కథను చెప్పే అద్భుతమైన కొల్లేజ్ కళాఖండాలుగా మార్చండి

కావలసినవి: **పాత వార్తాపత్రికలు, కత్తెర గ్లూ స్టిక్, కాగితం లేదా కాన్వాస్, మార్కర్లు**

తయారీ: వార్తాపత్రికల నుంచి ఆసక్తికరమైన చిత్రాలు, ముఖ్యాంశాలు, ఇతర న్యూస్‌ను కత్తిరించండి. కొల్లేజ్ సృష్టించడానికి కటౌట్ లను కాగితం లేదా కాన్వాస్‌పై అమర్చండి. విభిన్న లే ఔట్‌లు, థీమ్‌లతో ప్రయోగం చేయండి. తర్వాత, ఈ ముక్కలను అతికించండి. మార్కర్‌లు లేదా రంగు పెన్సిళ్లతో కొల్లేజ్‌కు నేపథ్యాలను జోడించండి. ఇలా తయారైన కొల్లైజ్‌ను కనిపించేలా వేలాడదీయండి.



సీడీ సన్ క్యాచర్లు...

పాత సీడీలకు మిరుమిట్లు గొలిపే సన్ క్యాచర్లుగా కొత్త జీవం పోయవచ్చు.

కావలసినవి: **పాత సీడీలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్లు, క్రాఫ్ట్ జిగురు, స్ట్రింగ్ లేదా రిబ్బన్, పూసలు, ఇతర డెకరేషన్‌లు.**

తయారీ: రంగురంగుల డిజైన్లు, నమూనాలు లేదా అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌తో సీడీలు మెరిసే వైపు పెయింట్ చేయండి. అంచుల చుట్టూ లేదా మధ్యలో పూసలతో అలంకరించి వాటిని సీడీ మధ్యలో ఉన్న రంధ్రం ద్వారా దారంతో అతికించండి. వీటిని ఎండ పడే కిటికీలో వేలాడదీస్తే అందమైన కాంతులు వెదజల్లుతాయి.

న్యూస్ పేపర్లతో ఫోటో ఫ్రేమ్...

కొన్ని పాత న్యూస్‌పేపర్లను తీసుకొని ప్రతి షీట్‌ను ముక్కలుగా చింపివేయండి. ఇప్పుడు, వార్తాపత్రికను ఒక మూల నుండి చుట్టడం ద్వారా సన్నని రోల్స్ తయారు చేయండి. రోల్‌ను భద్రపరచడానికి వార్తాపత్రిక అంచుని అతికించండి.

ఇప్పుడు మీకు కావలసిన ఏ పరిమాణంలోనైనా కార్డ్ బోర్డ్ ముక్కను తీసుకోండి. మీరు ఫ్రేమ్ చేయాలనుకుంటున్న ఛాయాచిత్రాన్ని ఫ్రేమ్ మధ్యలో ఉంచి, దాని రూపురేఖలను గీయండి. వార్తాపత్రిక రోల్స్‌ను అవుట్‌లైన్‌లపై అతికిస్తూ నాలుగు వైపులా కవర్ చేయండి. అదనపు వార్తాపత్రికను కత్తిరించండి. ఫ్రేమ్‌కు మీకు నచ్చిన ఏ రంగునైనా పెయింట్ చేసి ఫోటోగ్రాఫ్‌ను అతికిస్తే సరి.. మీ ఫోటో ఫ్రేమ్ రెడీ!

పిల్లల చేత ఇలాంటి వాటిని తయారు చేయిస్తే వారికి మంచి కాలక్షేపం అవుతుంది.



పాత ప్లాస్టిక్ సీసాలు, మెటల్ సీసా మూతలు, పెరుగు కుండలు, స్ట్రాలు, ప్యాకేజింగ్ వంటి శుభ్రమైన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించండి. తర్వాత, ఇంట్లో 'రీసైకిల్డ్ ఆర్ట్ స్టేషన్'ని సృష్టించండి. జిగురు, మార్కర్లు, పెయింట్, కత్తెర, ఇతర క్రాఫ్టింగ్ మెటీరియల్‌ను ఇచ్చి పిల్లలకు ఒక సవాలు ఇవ్వండి. వారు ప్లాస్టిక్ బాటిల్‌ను బర్డ్ ఫీడర్‌గా మార్చగలరా? ఆ పెరుగు కుండ పూల కుండగా మారగలదా? లేదా ప్లాస్టిక్ మూతలన్నీ కలబోసుకుని రోబోట్ శిల్పంగా మారతాయేమో చూద్దాం!

● యోగా

మానసిక శక్తిని పెంచే శ్వాస

నాసిక రంధ్రాల ద్వారా శ్వాసను లోపలికి తీసుకుంటూ, తిరిగి వదులుతూ చేసే ప్రాణాయామ పద్ధతులలో ముఖ్యమైనవి నాలుగు ఉన్నాయి. వాటిలో..

కపాలభాతి: ఈ ప్రాణాయామంలో వేగంగా ఊపిరి తీసుకోవడం, వదలడం ఉంటుంది. ఈ విధానం వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. శ్వాసకోశ కండరాలు బలోపేతం అవుతాయి. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీని వల్ల చేసే పనిపైన శ్రద్ధ, సృజనాత్మకత పెరుగుతుంది. ఒక ప్రశాంతమైన స్థలంలో సుఖాసనంలో కూర్చొని, ముక్కు ద్వారా శ్వాస పీల్చుతూ, వదులుతూ ఉండాలి.



భస్త్రిక: ఈ ప్రాణాయామం ద్వారా శరీరంలో ఆక్సిజన్ స్థాయిని పెంచవచ్చు. నోటిద్వారా శ్వాసను తీసుకొని, నోటిద్వారా వదలాలి. ఈ ప్రక్రియను పది-పదిహేను సార్లు పదే పదే చేయాలి.


భ్రామరి: ఈ ప్రాణాయామం ద్వారా మనస్సు ప్రశాంతంగా మారుతుంది. నోటితో తేనెటీగ లాగ హమ్ చేస్తూ .. నాసిక రంధ్రాల ద్వారా గాలి పీల్చుకొని, నెమ్మదిగా వదలాలి.

ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్యులను సంప్రదించి, నిపుణుల సలహాతో వీటిని సాధన చేయడం వల్ల మెరుగైన ఫలితాలను పొందుతారు.

సాక్షి సినిమా

ఆధ్యాత్మిక గురువు రవిశంకర్‌గా విక్రాంత్

● కొలంబియా అంతర్యుద్ధం ప్రధానాంశంగా 'వైట్'



● విక్రాంత్

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ జీవితం వెండితెర పైకి రానుంది. రవిశంకర్ జీవితంతో సినిమా రానుందని ఎప్పట్నుంచో ఓ వార్త ప్రచారంలో ఉంది. బాలీవుడ్ దర్శక-నిర్మాతలు సిద్ధార్థ్ ఆనంద్, మహవీర్ జైన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు కూడా టాక్ వినిపించింది. ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రను విక్రాంత్ మాస్సీ చేయనున్నారనే ఊహాగానాలూ నెలకొన్నాయి. అందుకు తగ్గట్టు గత ఏడాది రవిశంకర్‌ని కలిశారు విక్రాంత్. ఆయన పాత్రలో ఒదిగిపోవడానికి కావాల్సిన సలహాలు, సూచనలు తీసుకున్నారట. ఈ చిత్రం రెగ్యులర్ షూట్‌ని జూలైలో ఆరంభించాలనుకుంటున్నారన్నది తాజా సమాచారం. 'వైట్' టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రానికి యాడ్ ఫిల్మ్ మేకర్ మాంటూ బస్సీ దర్శకత్వం వహించనున్నారు. కొలంబియాలో జరిగిన అంతర్యుద్ధాన్ని పరిష్కరించడంలో రవిశంకర్ ఏ విధంగా కీలక పాత్ర పోషించారనేది ఈ చిత్రం ప్రధానాంశమని సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రలో ఒదిగిపోవడానికి విక్రాంత్ మాస్సీ మేకోవర్ అవుతున్నారు. హిందీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందించి, పలు భాషల్లో అనువదించి, రిలీజ్ చేయాలనుకుంటున్నారు. వచ్చే ఏడాది 'వైట్' విడుదల కానుంది.

వారం ముందుగానే...



● టామ్ క్రూజ్

హాలీవుడ్ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అందులోనూ ఇండియాలో అద్భుతమైన ఆదరణ ఉంటుంది. తాజాగా భారతదేశంలో విడుదల కానున్న మరో క్రేజీ హాలీవుడ్ మూవీ 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్'. టామ్ క్రూజ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి క్రిస్టోఫర్ మెక్ క్వారీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఇండియాలో తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో మే 23న విడుదల కావాల్సి ఉంది. అయితే వారం ముందుగానే మే 17న ఈ చిత్రాన్ని ఇండియాలో రిలీజ్ చేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు మేకర్స్. ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న 'మిషన్ ఇంపాజిబుల్' ఫ్రాంచైజీలో భాగంగా ఎనిమిదో చిత్రంగా 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్' రూపొందింది.



ఆ అనుబంధానికి పేరు పెట్టలేను!

- సమంత

''జీవితంలో మనం తీసుకునే ఒక నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా నిర్ణయిస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసీ తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయి'' అని సమంత అన్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో ఇటీవల నిర్వహించిన 'గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో' గోల్డెన్ క్వీన్ అవార్డు అందుకున్నారు సమంత. అనంతరం ఆమె తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తాను. నా అదృష్టంతో పాటు నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానం సంపాదించుకోవడానికి కారణం అయింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను'' అని చెప్పారు సమంత. ఇంకా తన వ్యక్తిగత జీవితం గురించి ఆమె మాట్లాడుతూ– ''నా ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ రవీంద్రన్ (నటుడు, దర్శకుడు) ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. ఫ్రెండా? సోదరుడా? కుటుంబ సభ్యుడా? రక్త సంబంధీకుడా? అనేది చెప్పలేను'' అన్నారు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే... ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. అలాగే తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' మే 9న రిలీజ్ కానుంది.

తన కోసమే నా పొగరే అణిగేనా...



● నాని

నాని, శ్రీనిధీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో 'హిట్' యూనివర్స్‌లో వస్తోన్న మూడో చిత్రమిది. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా మే 1న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. మిక్కీ జే మేయర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'తన కోసమే నా పొగరే...' అంటూ సాగే మూడో పాటని శుక్రవారం విడుదల చేశారు. రాఘవ్ సాహిత్యం అందించిన ఈ పాటని సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పాడటం విశేషం. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా, తన కోసమే నా పరుగే ఇక ఆగేనా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''హిట్: ది థర్డ్ కేస్' సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన 'ప్రేమ వెల్లువ, అభీ బార్ అర్జున్ సర్కార్...' పాటలకు మంచి స్పందన వచ్చింది. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా...' పాట కూడా ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

హ్యాట్రిక్ హిట్ కావడం ఆనందంగా ఉంది

- ఇంద్రగంటి మోహనకృష్ణ



● రూప, ప్రియదర్శి, మోహనకృష్ణ, తనికెళ్ల భరణి, శివలెంక కృష్ణప్రసాద్

''శివలెంక కృష్ణప్రసాద్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'జెంటిల్ మ్యాన్, సమ్మోహనం' చిత్రాలు హిట్ అయ్యాయి. మా కాంబోలో వచ్చిన మూడో చిత్రం 'సారంగపాణి జాతకం' హ్యాట్రిక్ హిట్ అయినందుకు హ్యాపీగా ఉంది. సినిమా బాగుందని ఎంతో మంది ఫోన్ చేస్తున్నారు... మెసేజ్‌లు చేస్తున్నారు. మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని ఇంద్రగంటి మోహనకృష్ణ తెలిపారు. ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా రూపొందిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ– ''ఈ రోజు మా టీమ్ గెలిచిందంటే నేనూ గెలిచాను. సినిమా గెలిచింది... మేం గెలిచాం'' అని చెప్పారు. ''మా సినిమా ప్రభంజనం ఇప్పుడే ప్రారంభం అయింది'' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. ''చాలా రోజుల తర్వాత థియేటర్‌లో అందరూ పగలబడి నవ్వుతున్నారు. నవ్వులతో థియేటర్ దద్దరిల్లిపోతోంది'' అని తనికెళ్ల భరణి పేర్కొన్నారు. ఈ సెలబ్రేషన్స్‌లో నటులు అవసరాల శ్రీనివాస్, వడ్లమాని శ్రీనివాస్, కెమెరామేన్ పీజీ విందా, ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం కరువైతే...



● శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్

''కలియుగమ్ 2064' సినిమా ట్రైలర్ ఆసక్తిగా ఉంది. ఫొటోగ్రఫీ, క్యారెక్టర్స్ డిజైన్, ఆర్టిస్టుల నటన... ఇలా అన్నీ ఒక మోడ్రన్ కైండ్ ఆఫ్ బుక్ చదివిన అనుభూతినిచ్చాయి. ఈ సినిమాని అందరూ థియేటర్లలో తప్పకుండా చూడండి'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన చిత్రం 'కలియుగమ్ 2064'. ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కిశోర్ కీలక పాత్ర పోషించారు. కేఎస్ రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం మే 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగులో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేయనుంది. ఈ సినిమా ట్రైలర్‌ని రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. ''సైన్స్ ఫిక్షన్ అండ్ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. 2064లో ఆహారం, నీరు, మానవత్వం అనేవి కరువైనప్పుడు విచక్షణా జ్ఞానం కోల్పోయిన మనుషులు ఎలాంటి ఘోరాలకి పాల్పడ్డారు? అనే థీమ్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ | ఇది చూడొచ్చు

అమెరికన్ ప్రెసిడెంటా... మజాకా...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం జీ 20 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా దర్శకుని ఊహ అనేది ప్రేక్షకుల ఊహకందకపోతే అప్పుడు ఆ సినిమా పండుతుంది. ముఖ్యంగా హాలీవుడ్ దర్శకుల ఆలోచనలే వేరు. ఏది అసాధ్యమో, ఏదైతే జరగదు అని ప్రేక్షకులు అనుకుంటారో దాన్నే సినిమాలో చూపిస్తుంటారు హాలీవుడ్ డైరెక్టర్స్. హాలీవుడ్ దర్శకుడు పాట్రిసియా రీగెన్ తీసిన 'జీ 20' సినిమా ఆ కోవలోకి చెందినదే. ఒక్కసారి ఊహించండి... ప్రపంచంలోనే ఉత్తమోత్తమ సురక్షితమైన వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు అనే విషయం మనకు తెలుసు. మరి... ఆ అధ్యక్ష స్థానంలో ఉన్న వ్యక్తిని తన కుటుంబంతో పాటు బందీలుగా తీసుకుని ప్రపంచాన్ని శాసిద్దామనుకున్న విలన్‌ను అమెరికా ప్రెసిడెంట్ ఎలా ఎదుర్కొన్నారో ఈ 'జీ 20'లో చూడవచ్చు. అది కూడా అమెరికన్ ప్రెసిడెంట్‌ను, అతని కుటుంబాన్ని బందీలుగా చేసుకోవడం కూడా చిన్న వేదిక మీదైతే కాదు, దాదాపు అరడజను దేశాధినేతలతో పాటు జీ 20 శిఖరాగ్ర సమావేశంలో హై సెక్యూరిటీ నడుమ ఉండగా అమెరికన్ ప్రెసిడెంట్‌తో పాటు అక్కడున్న మిగతా దేశాధినేతలందరినీ బందీలుగా చేసుకుంటాడు విలన్. ఇక్కడ ఈ సినిమా దర్శకుడు ఇంకా వినూత్నంగా ఆలోచించాడు. బందీలుగా ఉన్న తన కుటుంబాన్ని, ఇతర దేశాధినేతలను కూడా విలన్‌తో పోరాడి విడిపించే బాధ్యత ప్రెసిడెంట్ మీదే పెట్టాడు సదరు సినిమా డైరెక్టర్. 'జీ 20' సినిమా మంచి ఉత్కంఠతతో ప్రారంభమై, ఆద్యంతం ప్రేక్షకుడిని ఉగ్రూతలూగిస్తుంది. ముఖ్యంగా అమెరికన్ ప్రెసిడెంట్ పోరాట సన్నివేశాలు సినిమాకే హైలెట్ అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ సినిమాలో అమెరికన్ ప్రెసిడెంట్ కుంగ్ ఫూ ఫైటర్, గన్ షూటర్, అలాగే హెలికాప్టర్ రైడర్ కూడా. ఇక మరో పెద్ద ట్విస్ట్ ఏంటంటే సదరు అమెరికన్ ప్రెసిడెంట్ ఈ సినిమాలో ఓ లేడీ. ఈ పాత్రలో డేనియల్ సట్టన్ సూపర్‌గా నటించారు. పైన చెప్పుకున్నట్టు ఓ లేడీ అమెరికన్ ప్రెసిడెంట్ తన కుటుంబంతో పాటు ఇతర దేశాధినేతలను సూపర్ ఫైటింగ్ స్కిల్స్‌తో సేవ్ చేయడమనేది మామూలు కాన్సెప్టా... ఆలోచించండి. దటీజ్ 'జీ 20'. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా తెలుగు వెర్షన్ కూడా లభ్యమవుతోంది. అయితే మీ పిల్లలను ఈ సినిమాకి దూరంగా ఉంచి మీరు మాత్రం వాచ్ ఇట్ ఫర్ వీకెండ్.



– హరికృష్ణ ఇంటూరు